క్లుప్తంగా

పుణ్యస్నానాలకు గ్రీన్‌సిగ్నల్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మహాశివ రాత్రి సందర్భంగా భక్తులు గోదావరి పుణ్యస్నానాలకు రావొద్దని తీసుకున్న నిర్ణయాన్ని అధికారులు వెనక్కు తీసుకున్నారు. హాజీపూర్ మండల, మంచిర్యాల పరిసర ప్రాంత ప్రజలు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించేలా చూడాలని భక్తుల విన్నపం మేరకు అధికారులు పూర్తిస్థాయిలో సమీక్షించి గోదావరి స్నానాలకు అంగీకరించారు. భక్తులు ఇబ్బంది పడకుండా గోదావరి పరిసర ప్రాంతాలను శుభ్రపరిచారు.

ఆహార భద్రత సంబంధిత ఫిర్యాదులకు అవకాశం

మంచిర్యాలఅగ్రికల్చర్: ఆహారభద్రతకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు అదనపు కలెక్టర్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆహార భద్రత శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆహార భద్రతకు సంబంధించిన ఫిర్యాదులు చేయడం కోసం ప్రజలకు అవకాశం కల్పించినట్లు, రాష్ట్రంలో ఆహారభద్రత సమస్యలపై diripmtg@gmail.com/fssmutg@gmail.com లకు ఈ మెయిల్ ద్వారా, 9100105795కు మొబైల్, వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదు అందిన నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామని తెలిపారు.

సైబర్‌క్రైమ్‌పై అవగాహన



దీసీపీని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

మంచిర్యాలఅర్బన్: స్థానిక మిమ్స్ డిగ్రీ కళాశాలలో గురువారం సైబర్ సెక్యూరిటీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ అశోక్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సైబర్ క్రైం ఎన్ని రకాలుగా ఉంటుందనే విషయాలపై విద్యార్థులకు వివరించారు. జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సీఐ రవీందర్, కరస్పాండెంట్ శ్రీనివాస్‌రాజు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

దండేపల్లి: మండలంలోని రెబ్బనపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన 12క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం పట్టుకున్నట్లు దండేపల్లి ఏఎస్సై పాల్ తెలిపారు. గ్రామానికి చెందిన కట్కం శ్రీనివాస్ అనే కిరాణ వ్యాపారి అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసి ఉంచారనే సమాచారం మేరకు పట్టుకున్నారని, పట్టుకున్న బియ్యాన్ని దండేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

అన్ని రంగాల్లో సాధికారత సాధించాలి



కేక్ కట్ చేసి సంబురాలు

పాతమంచిర్యాల: మహిళలు ఆర్థిక, రాజకీయ, సామాజిక పరంగా అన్ని రంగాల్లో సాధికారిత సాధించాలని అంజనీపుత్ర సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్, ఎండీ పిల్లి రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని చున్నంబట్టివాడలోని అంజనీపుత్ర కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసుకొని, మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో అంజనీపుత్ర ఎస్టేట్స్ డైరెక్టర్లు కిషన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



శంభో శంకర..!

- మహాశివరాత్రికి ఆలయాల ముస్తాబు
- నేడు వైభవంగా శివపార్వతుల కల్యాణం
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- పలుచోట్ల పోలీసుల భారీ బందోబస్తు

మహాశివరాత్రిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఉన్న శైవాలయాలు ముస్తాబయ్యాయి. ఆలయ కమిటీలు, అధికారుల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నేడు శుక్రవారం అంగరంగవైభవంగా పూజారుల మంత్రోచ్చరణల మధ్య శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

కత్తెరసాలలో...



చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 10:20గంటలకు శ్రీ భ్రమరాంభిక దేవి, మల్లిఖార్జున స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ముక్త రవి తెలిపారు.

దండేపల్లిలో...



దండేపల్లి: మండలంలోని ద్వారక గోదావరి ఒడ్డున గల శ్రీ దత్తాత్రేయస్వామి, గంగమ్మతల్లి ఆలయాలు, లక్ష్మీకాంతపూర్ గోదావరి ఒడ్డున శ్రీ మల్లికార్జునస్వామి, మేదరిపేటలోని శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి, నర్సాపూర్‌లో శ్రీ భ్రమరాంభ మల్లిఖార్జున స్వామి, గూడెం శ్రీమహాలింగేశ్వర స్వామి ఆలయాలను సిద్ధం చేశారు.

బుగ్గ రాజేశ్వర ఆలయం

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయం ముస్తాబైంది. శుక్రవారం నిర్వహించే మహాజాతర కోసం ఆలయ ఆవరణలో షామియానాలు, భక్తుల దర్శ నం కోసం సర్వ దర్శనం, ప్రత్యేక దర్శనాలు, వీఐపీ దర్శనాల క్యూలైన్లను ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భజాభజంత్రీలతో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య సంప్రదాయబద్ధంగా పాలపారకను ఎదుర్కొని పచ్చని పందిరి వేసే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. పోలీసు, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్ శాఖ, ఇతర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసి అన్ని శాఖల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్లు ఈ.వో బాపురెడ్డి తెలిపారు.



శ్రీ బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయం

జాతర ఏర్పాట్ల పరిశీలన...

శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయాన్ని గురువారం డీసీపీ అశోక్‌కుమార్ సందర్శించి జాతర ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని సూచించారు. గర్భగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, బెల్లంపల్లిరూరల్, వన్ టౌన్ సీఐలు అఫ్జలుద్దీన్, దేవయ్య, తాళ్లగురిజాల ఎస్సై నరేష్, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీదేవి, ఈవో బాపురెడ్డి, సిబ్బంది ఉన్నారు.




పూజల్లో పాల్గొన్న డీసీపీ అశోక్‌కుమార్

అందమైన అడవిలో జాతర



నెన్నెల: చుట్టూ పచ్చని అడవి, పక్కన పెద్ద వాగు కోణంపేట, బోగంపల్లి అటవీ ప్రాంతం నుంచి వెళ్తే మందలమల్లన్నను చేరుకుంటాం. అడవి తల్లి ఒడిలో ఆహ్లాదకరమైన వాతావరణంలో భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి వెలిశారు. నెన్నెల మండలంలోని జంగాల్‌పేట, కోణంపేట పంచాయతీల మధ్యలోని అటవీ ప్రాంతంలో ఉన్న పురాతన గుడి చింతల వద్ద మందలమల్లన్న జాతర శివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 8న ప్రారంభమై 9న నాగవెల్లి ఉత్సవంతో ముగుస్తుంది. ఒగ్గుడోలు కళాకారులు భ్రమరాంబ మల్లిఖార్జున కల్యాణాన్ని పట్నాలు వేసి అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. పట్టు వస్త్రాలు సమర్పించి పసుపు, కుంకుమ, బియ్యంతో ఆలయం ఎదుట పట్నాలు, ముగ్గులు వేసి ఒగ్గు పూజలు, డమరుకాలతో ప్రత్యేక పూజలు చేస్తారు. మల్లన్నస్వామి చరిత్రను ఒగ్గు కళాకారులు వినిపిస్తారు. వివిధ మండలాల నుంచి భక్తులు ఆటోలలో, ఎడ్లబండ్లలో అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

వేలాల పిలుస్తోంది..!



స్వయంభువుగా వెలిసిన శివలింగం

జైపూర్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రసిద్ధిగాంచిన శ్రీ మల్లన్నస్వామి జాతరకు వేలాల ముస్తాబైంది. ఏటా మహాశివ రాత్రికి ఇక్కడ మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జాతర నిర్వహిస్తుండగా, ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యుత్ దీపాలంకరణతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తుల దివ్యదర్శనం కోసం క్యూలైన్లలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఉచిత దర్శనంతో పాటు స్పెషల్ దర్శనం రూ.50, సులభ దర్శనం రూ.100 కల్పించడానికి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గుట్టపై ఉచిత దర్శనంతో పాటు రూ.50ద్వారా స్పెషల్ దర్శనం కల్పించనున్నారు. పుణ్య స్నానాల కోసం గోదావరి నదిలో, పుష్కరఘాట్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన వేలాల జాతరకు తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, జయశంకర్ భూపాల్‌పల్లి, వరంగల్, హైదరాబాద్, నిజామాబాద్‌తో పాటు మహారాష్ట్రలోని సిరోంచ, గడ్చిరోలి జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరానున్నారు. గ్రామ శివారులో వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశారు. నీటి సౌకర్యం కల్పించారు. గుట్ట కింద నుంచి పై వరకు వీధి దీపాలు ఏర్పాటు చేశారు. గట్టు మల్లన్న స్వామి చెలిమె నీటిని తీర్థంగా తీసుకుని, భోనంలో తీర్థంగా పోసుకోవడం, మీద చల్లుకోవడం ఫలితంగా శారీరక రుగ్మతలు తొలగి.. పాడిపంటలు.. సంసారం సౌభాగ్యలతో పాటు శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. జాతరకు సుమారు 4లక్షల మంది భక్తులు తరలిరానున్నట్లు అధికారులు అంచనా వేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



చెన్నూర్/జైపూర్/భీమారం: చెన్నూర్ పట్టణంలోని గోదావరిరోడ్డులో గల ఎల్లమ్మతల్లి ఆలయం వరకు సీసీ రోడ్డు పనులకు, కమ్మరిబొగుడ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి భూమిపూజ చేశారు. జైపూర్ మండలం గంగిపల్లిలో నూతనంగా నిర్మించే ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కరీంనగర్‌లోని రేకుర్తి కంటి ఆసుపత్రిలో భీమారం మండలానికి చెందిన పలువురు ఆపరేషన్లు చేసుకొని బస్సులో వస్తుండగా వారిని పరామర్శించారు.

రెడ్‌క్రాస్ సొసైటీకి ఫ్రీజర్ అందజేత

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ యాజమాన్యం గురువారం మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్‌కు ప్లాస్మా స్టోరేజ్ డీప్ ఫ్రీజర్ విరాళంగా అందజేశారు. ఓరియంట్ సిమెంట్ కంపెనీ యూనిట్ హెడ్ మహేంద్ర ప్రతాప్ జోషి మంచిర్యాల జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ భాస్కర్‌రెడ్డికి కంపెనీ ప్లాంట్‌లో అందించారు.



పాఠశాలలో మహాశివరాత్రి



మంచిర్యాలఅర్బన్: స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తుగా మహాశివరాత్రి వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అనంతరం మహిళ దినోత్సవం నిర్వహించారు. మ్యూజికల్ చైర్, బెలూన్ బ్లాస్ట్, కబడ్డీ, ఖోఖో, అంత్యక్షరీ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యురాలు స్వరూపారాణి, పాఠశాల ఏజీఎం రాజు, కో-ఆర్డినేటర్ శివకోటేశ్వరావు, డీన్ నాగేశ్వరావు, పీఈటీలు రాజేందర్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి బల్దియా బడ్జెట్ రూ.18.96కోట్లు

బెల్లంపల్లి: మున్సిపల్ 2024-25వార్షిక సాధారణ అంచనా బడ్జెట్‌ను మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అధ్యక్షతన గురువారం వార్షిక బడ్జెట్ ప్రత్యేక సమావేశం నిర్వహించగా ఎమ్మెల్యే గడ్డం వినోద్, కలెక్టర్ బదావత్ సంతోష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో బడ్జెట్ అంచనా ఆదాయం, వ్యయం, కేటాయింపులను గణాంకాలతో ప్రవేశపెట్టారు. మున్సిపల్ వార్షిక ఆదాయం రూ.18కోట్ల 96లక్షల 78వేలుగా అంచనా వేశారు. సమావేశంలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ పద్దుపై సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినోద్ మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధికి సభ్యులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ప్రతి మూడు నెలలకోసారి ప్రత్యేక సమావేశం నిర్వహించి మున్సిపల్ అభివృద్ధిపై సమీక్ష చేస్తానన్నారు. అవసరమైతే సీఎంతో మాట్లాడి ప్రత్యేక నిధులు తీసుకొచ్చేందుకు పాటు పడతానని పేర్కొన్నారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ.. మున్సిపల్ అభివృద్ధికి అధికారులు, కౌన్సిలర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. మున్సిపల్ ఆస్తి పన్ను వసూలును లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాలని తెలిపారు. నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాలలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జి.మల్లారెడ్డి, మున్సిపల్ డీఈ మక్సూద్ అలీ, ఏఈ సందీప్, కౌన్సిలర్లు మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్, పక్కన ఎమ్మెల్యే

వినతిపత్రం అందజేత

మందమర్రిరూరల్: సింగరేణిలో ఉద్యోగి విరమణ పొందిన రోజునే మెడికల్ కార్డు, పెన్షన్ కార్డు ఇవ్వాలని సీఐటీయూ మందమర్రి బ్రాంచ్ అధ్యక్షుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. జీఎం ఆఫీస్ వద్ద గురువారం నిరసన తెలిపి ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందజేశారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట వద్ద ఫిబ్రవరి 25న అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న దొరిశెట్టి రాజయ్యకు అనే కూలీ మృతి చెందాడు.

'కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపణ'

బెల్లంపల్లి: సింగరేణి ఏరియా ఆసుపత్రి డీవైసీఎంఓ కార్మికులు, సిబ్బందిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) నాయకులు సిద్ధం శెట్టి రాజమొగిలి, పేరం శ్రీనివాస్, ఎస్ ,ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏరియా ఆసుపత్రిలో గత గుర్తింపు సంఘం టీబీజీకేఎస్‌తో కుమ్మక్కైన ఏరియా ఆసుపత్రి అధికారులు, నేటికీ అదే ధోరణిని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు.

సంక్షిప్త వార్తలు

ఆయిల్‌పామ్ తోటల పరిశీలన

కాసిపేట: మండలంలోని కొండపూర్ శివారులో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటలను వ్యవసాయ శాఖ, హార్టికల్చర్ అధికారులు గురువారం మ్యాట్రిక్స్ కంపెనీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు.

ఊరు శ్రీరాంపూర్‌లో బస్సులు నిలపాలి

మంచిర్యాలఅర్బన్: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఊరు శ్రీరాంపూర్ బస్టాప్ వద్ద బస్సులు నిలపాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం మంచిర్యాల అసిస్టెంట్ డిపో మేనేజర్ దేవపాలకు వినతిపత్రం అందజేశారు.

గ్రంథాలయానికి మెటీరియల్ అందజేత

కోటపల్లి: మండలకేంద్రంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న పనకంటి కపిల్ కుమార్ రూ.8వేల విలువగల 18రకాల కొత్త పుస్తకాలను కోటపల్లి గ్రంథాలయశాఖ ఇన్‌ఛార్జి మురళికి అందజేశారు.

బాండ్ల వివరాలు బహిర్గతం చేయాలి

పాతమంచిర్యాల: ఎస్‌బీఐ నుంచి బీజేపీకి ఎలక్టోరల్ బాండ్‌ల ద్వారా వచ్చిన విరాళాల వివరాలు బహిర్గతం చేయాలని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని రెడ్డికాలనీ ఎస్‌బీఐ బ్రాంచ్ ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్ రెగ్యులరైజ్ చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఉచితంగా రెగ్యులరైజ్ చేయాలని మాజీ మంత్రి, పెద్దపల్లి ఎంపీ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ బి.సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, చిన్నయ్య, జెడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

రూ.22.30కోట్ల బడ్జెట్‌కు ఆమోదం

- క్యాతనపల్లి బల్దియా బడ్జెట్‌ను ఆమోదించిన పాలకవర్గం

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ పాల్గొన్నారు. మొత్తం రూ.22కోట్ల 30లక్షల బడ్జెట్‌ను ప్రతిపాదించగా కౌన్సిల్, కో-ఆప్షన్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సాధారణ ఆదాయం రూ.8కోట్ల 20లక్షలు, క్యాపిటల్ ఆదాయం రూ.13కోట్ల 97లక్షలు, డిపాజిట్స్, అడ్వాన్స్‌లు రూ.12లక్షల 50వేలు, మొత్తం కలిపి 22కోట్ల 30లక్షలను ప్రతిపాదించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రాహుల్, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, జేఏఓ అనితాదేవి, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చెన్నూర్ వార్షిక బడ్జెట్ రూ.17.34కోట్లు

చెన్నూర్: మున్సిపల్ 2024-25సంవత్సర వార్షిక బడ్జెట్ రూ.17.34కోట్లకు పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చన రాంలాల్‌గిల్డా అధ్యక్షతన వార్షిక బడ్జెట్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, అదనపు కలెక్టర్ రాహుల్ హాజరయ్యారు. మున్సిపాలిటీ వార్షిక బడ్జెట్ రూ.17కోట్ల 34లక్షల 31వేలు కాగా వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.17.33కేటాయించగా రూ.1.23లక్షల మిగులు బడ్జెట్ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పనులకు వినియోగించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేను పాలకవర్గ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగాధర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



పాతమంచిర్యాల: గురుకుల డిగ్రీ కళాశాలలో...



మందమర్రిరూరల్: సన్మానిస్తున్న డీఆర్‌డీవో కిషన్



జిల్లా పరిషత్ కార్యాలయంలో...



రామకృష్ణాపూర్: పోటీల్లో పాల్గొన్న మహిళలు



దండేపల్లిలో ముగ్గుల పోటీలు

ఘనంగా మహిళా దినోత్సవం

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా గురువారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిపారు. మహిళలకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో, పాఠశాలల్లో మహిళా ఉద్యోగులను సన్మానించారు. మహిళల స్థితిగతులు బాగుంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. కేకులు కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో జెడ్పీ చైర్మన్ నల్లాల భాగ్యలక్ష్మి, జెడ్పీ సీఈవో గణపతి, భీమారంలో డీఎల్‌పీవో ధర్మారాణి, మందమర్రిలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జీఎం మనోహర్, సేవా సమితి అధ్యక్షురాలు సవిత, లక్సెట్టిపేటలో సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారంరెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్, రామకృష్ణాపూర్‌లో క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కమిషనర్ మురళీకృష్ణ, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



లక్సెట్టిపేట: మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో...



భీమారం: జెడ్పీటీసీ, ఎంపీటీసీని సన్మానిస్తూ..



నెన్నెలలో బహుమతులు అందజేస్తూ...



కోటపల్లి: ఎంపీపీని సన్మానిస్తూ...



బెల్లంపల్లిరూరల్: సన్మానిస్తున్న అధికారులు



హాజీపూర్ ఎంపీపీ కార్యాలయంలో...



వేమనపల్లి: ఎంపీపీ, జెడ్పీటీసీలను సన్మానిస్తూ..



మందమర్రిరూరల్: నృత్యం చేస్తున్న మహిళలు

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

రామకృష్ణాపూర్: పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న మాజీ కేంద్ర మంత్రి కాకా వెంకటస్వామి స్మారక పెద్దపెల్లి పార్లమెంట్ స్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రసవత్తరంగా సాగిన సెమీఫైనల్స్‌లో చివరికి ఆతిథ్య చెన్నూర్ జట్టు, రామగుండం జట్లు ఫైనల్స్‌కు చేరాయి. పోటీలను గురువారం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ స్టేడియంకు విచ్చేసి ఆసక్తిగా తిలికించారు. నియోజకవర్గస్థాయిలో గెలుపొందిన జట్లకు బహుమతులతో పాటు ప్రైజ్‌మనీని అందజేశారు. ఫైనల్ మ్యాచ్‌లను హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఈ నెల 9న నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, వివేక్ తనయుడు గడ్డం వంశీ, కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, పల్లెరాజు, నీలం శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

కోటపల్లి: మండలంలోని రొయ్యలపల్లిలో పత్తి కొనుగోలు చేస్తున్న మనోహర్ అనే వ్యక్తి, తూకంలో మోసం చేస్తున్నాడని గ్రామ యువకులు ఆరోపించారు. రైతులను మోసం చేస్తున్న ఈ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.